క్లుప్తంగా

యూత్ ఫెస్టివల్ ప్రారంభం

సీతంపేట: మండలంలోని సామరెల్లి గ్రామంలో యూత్ ఫెస్టివల్ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. మన్యం ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని సంస్థ చైర్మన్ జి.రవి తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న మేనేజింగ్ ట్రస్టీ ధనుంజయరావు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ అభివృద్ధి మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయరావు కోరారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన దాతల నుంచి విరాళాల సేకరణ చేపట్టారు. భక్తులు తమవంతు సహకారం అందించి, ఆలయ పూర్వవైభవానికి తోడ్పడాలన్నారు.

గురండిలో గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

భామిని: మండలంలోని గురండి గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీసర్వేపై సమీక్షించి, డీఎల్ఆర్ సర్వే పూర్తయిన రైతుల జాబితాను వీఆర్ఓ సిర్ల జయరాజ్ చదివి వినిపించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు మాట్లాడుతూ పక్కాగా సర్వే పూర్తి చేయాలని, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ రమేష్, సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, సర్పంచ్ జామి బైరాగి తదితరులు పాల్గొన్నారు.

రేపు ధర్నా



ధర్నాపై ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

సీతంపేట: జీసీసీ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 20వ తేదీన స్థానిక జీసీసీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టనున్నట్లు గిరిజన సంఘం నాయకులు పి.సాంబయ్య, గంగాధర్, శ్రీరాములు తెలిపారు. ఇదే విషయంపై ప్రచారానికి సంబంధించి, ముద్రించిన కరపత్రాలను కుశిమి వారపు సంతలో పంపిణీ చేశారు. అనంతరం ధర్నాపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గిరిజనోత్పత్తులకు మద్దతు ధర కల్పించడంలో జీసీసీ విఫలమైందని విమర్శించారు. చింతపండు, కొండచీపుళ్లు వంటి అటవీ ఉత్పత్తులకు పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు.

ఘనంగా గావు పండగ



గావు పండగలో యాదవులతో ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంట పంచాయతీ, గొల్లవానివలస గ్రామంలో గావు పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి తర్వాత ఈ పండగను యాదవులు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. సంకీర్తనలు, భక్తిగీతాలాపనలు, తప్పెటగుళ్ల ప్రదర్శనతో గ్రామంలో ఆధ్యాత్మిక, పండగ వాతావరణం నెలకొంది. యాదవులంతా కుటుంబసమేతంగా పూజల్లో పాల్గొని, భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఉరిటి రామారావు ఇలాంటి పండగలు జరుపుకోవడమనేది మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందజేయడమేనన్నారు.

నియోజకవర్గంలో 6,611 పట్టభద్రుల ఓటర్లు

రాజాం: నియోజకవర్గంలో 6,611 మంది పట్టభద్రుల ఓటర్లు నమోదైనట్లు తహసీల్దార్ విజయభాస్కర్ వెల్లడించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టభద్రుల ఓటర్ల వివరాలపై ఎలక్షన్ డీటీ రవికుమార్‌తో సమీక్షించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాకు సంబంధించి, మండలాల వారీగా వివరాలను పరిశీలించారు.

శివోహం!

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, శనివారం ప్రసిద్ధ శైవక్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ప్రధాన వీధులు, ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మార్మోగాయి. కొన్ని దశాబ్దాల తర్వాత శనిత్రయోదశి, శివరాత్రి ఒకేరోజు రావడంతో వేకువజాము నుంచే మందిరాలకు బారులు తీరిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి, దైవం పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. కొన్నిచోట్ల నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, శివపార్వతుల కల్యాణోత్సవం చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

–సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: చిదిమిలో పార్వతీ సమేత కాశీసుందర విశ్వేశ్వరస్వామికి ఎమ్మెల్యే కళావతి పూజలు



భామిని: సింగిడి నవగ్రహాలయంలో భక్తుల దీపారాధన



సీతంపేట: కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఐటీడీఏ పీఓ నవ్య



భామిని: పెద్దదిమిలి ఎండల మల్లన్న సన్నిధిలో భక్తుల పూజలు



భామిని: శివపార్వతుల కల్యాణం అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం



వెంకటరాజపురం శివాలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కొమరాడ: శ్రీగుంపస్వామీశ్వరుని ఆలయంలో డీఎస్పీ సుభాష్ దంపతుల పూజలు



గరుగుబిల్లి: గొట్టివలసలో శివుడి దర్శనానికి క్యూలో భక్తులు



కొమరాడ: దైవ దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు



గరుగుబిల్లి: గొట్టివలసలో కోలాటం సందడి



కురుపాం: నీలకంఠస్వామి ఆలయంలో భక్తుల పూజలు



వీరఘట్టం: దైవదర్శనానికి శనీశ్వరాలయం వద్ద క్యూకట్టిన భక్తులు



భామిని: మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం



సీతంపేట: భక్తులతో నిండిన కాశీవిశ్వేశ్వరాలయం



పాలకొండ: కొండాపురం ఆలయం వద్ద భక్తుల సందడి

గృహసారథులే గెలుపు వారధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: గృహసారథులే పార్టీ గెలుపు వారధులని, ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా గృహసారథులు పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని బందలుప్పి సచివాలయం పరిధిలోని గృహ సారథులతో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. విధి విధానాలను దిశా నిర్దేశం చేశారు. ప్రతి వలంటీర్ పరిధిలోని గృహ సారథులు వారికి కేటాయించిన 50కుటుంబాలకు సంబంధించి అర్హులకు సంక్షేమ పథకాలు అందించి సేవ చేసే విధంగా పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. వలంటీర్ పరిధిలోని 50 కుటుంబాల సభ్యులను గృహ సారథులు పరిచయం చేసుకుని వారితో ఐకమత్యమంగా ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం ద్వారా పరిష్కార మార్గాలను చూపించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందే విధంగా గృహ సారథులు, కన్వీనర్లు కీలకంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా గృహ సారథులు, కన్వీనర్లు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీమ్మి రమేష్, సర్పంచ్‌లు వై.ప్రతాప్, ప్రమీల, వై.తిరుపతిరావు, జి.రాజు, బి.నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంచార పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: పాడిరైతులు సంచార పశువైద్య వాహన సేవలు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ బి.జయప్రకాష్ కోరారు. రాజాం నియోజకవర్గానికి సమకూర్చిన అదనపు సంచార పశువైద్య వాహనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఒకే వాహనం ఉండేదని, తద్వారా కొంతమేర రైతులకు, వాహన సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. ఆ ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం నియోజకవర్గానికి రెండో వాహనం కేటాయించిందని తెలిపారు. ఒకటి రాజాం, రేగిడి మండలాలకు కాగా రెండోది సంతకవిటి, వంగర మండలాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం: వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పార్టీ శ్రేణులను కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాజాం పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలతో శనివారం సమావేశమైన వారు 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాల్సిన బాధ్యత గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో పాటు ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. అంతకుముందు సారధి గ్రామంలో జరుగుతున్న రామయ్యతండ్రి సంబరాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాల్గొని, రామయ్యతండ్రి కోళ్లకు పూజలు చేశారు. పార్టీ నేతలు పొట్నూరు లక్ష్మణరావు, దూబ గోపాలం, కిల్లారి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వంగర మండలం కన్వీనర్ కరణం సుదర్శనరావు పాల్గొన్నారు.

సంచార పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: పాడిరైతులు సంచార పశువైద్య వాహన సేవలు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ బి.జయప్రకాష్ కోరారు. రాజాం నియోజకవర్గానికి సమకూర్చిన అదనపు సంచార పశువైద్య వాహనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఒకే వాహనం ఉండేదని, తద్వారా కొంతమేర రైతులకు, వాహన సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. ఆ ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం నియోజకవర్గానికి రెండో వాహనం కేటాయించిందని తెలిపారు. ఒకటి రాజాం, రేగిడి మండలాలకు కాగా రెండోది సంతకవిటి, వంగర మండలాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ వాహనాల ద్వారా పశువుల వద్దకే వైద్యసేవలు అందించనున్నామన్నారు. 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే సేవలు పొందవచ్చన్నారు.

కోటి దీపోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



కోటిదీపోత్సవ జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని పాల్తేరు పార్వతీ మల్లికార్జునస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉడమల అప్పలనాయుడు, ఎంపీటీసీ ప్రతినిధి వంగపండు రమేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వంగపండు జోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గుమ్మలక్ష్మీపురం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో సైన్స్ ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఎగ్జిబిషన్) పోటీలకు గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తులాల సుష్మ, కందుల వందన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక భీముడు శనివారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని డీవీఎం స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో ఆయా విద్యార్థులు ఈకో ఫ్రెండ్లీ మెటీరియల్స్ ప్రాజెక్ట్ చేసి, ప్రతిభ కనబరిచారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వారు కూరగాయల తొక్కల ద్వారా తెల్లకాగితాలు, పేపరు ప్లేట్లు, టిస్యూ పేపర్లు తయారు చేసుకోవచ్చని, వీటి వినియోగం అనంతరం అవి భూమిలో కలిసిపోయి ఎరువుగా కూడా మారుతుందని వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

అన్నదానం



పాలకొండ రూరల్: అన్నప్రసాదం స్వీకరించేందుకు బారులుతీరిన భక్తులు

పాలకొండ రూరల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, మండల కేంద్రంలోని సనారీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు విజయవాడ, గుంటూరు, కృష్ణా, రాజమండ్రి, తెనాలి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్న భక్తులు దైవదర్శనానంతరం స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు శనివారం అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీపురానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



తోటపల్లిలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రూ.40 లక్షలతో రోడ్డు మరమ్మతులు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస నుంచి నారసింహునిపేట వరకు గల ఆర్అండ్‌బీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం రూ. 40 లక్షలు మంజూరు చేసింది. దీంతో అధికారులు మరమ్మతులు చేశారు. మరమ్మతులకు రూ.80 లక్షలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రతిపాదనలు పంపించగా.. ప్రభుత్వం 40 లక్షల రూపాయలు మంజూరు చేసింది. మరమ్మతులు దాదాపు పూర్తయ్యాయని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తప్పవని, రహదారి భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతివేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు.

రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎక్కువ స్పీడ్‌తో వెళ్లరాదని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు వెంట ఉంచాలన్నారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజారావు సిబ్బంది కిషోర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.